క్లుప్తంగా

మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కమిటీలో స్థానం

జూలూరుపాడు: తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా వెంగన్నపాలేనికి చెందిన బాపట్ల మురళి నియమితులయ్యారు. హైదరాబాద్(శంషాబాద్)లో ఆదివారం జరిగిన మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తమరావు పటేల్ చేతులమీదుగా నియామకపత్రాన్ని మురళి అందుకున్నారు. తన ఎంపికకు సహకరించిన మున్నూరుకాపు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, రాజ్యసభ్యులు వద్దిరాజు రవిచంద్ర, రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తమరావుపటేల్‌కు మురళి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీఎంగా బాధ్యతల స్వీకరణ


రామకృష్ణ

ఇల్లెందురూరల్: ఇల్లెందు మండల ఏపీఎంగా రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇల్లెందులో ఏపీఎంగా కొనసాగిన కామిశెట్టి దుర్గారావు మహబూబాబాద్ జిల్లా కురవి మండలానికి బదిలీ కాగా.. ఆయన స్థానంలో సుజాత్‌నగర్ ఏపీఎంగా ఉన్న రామకృష్ణను ఇల్లెందు మండలానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో మహిళా సంఘాల ఆర్థిక బలోపేతం కోసం కృషి చేస్తానని చెప్పారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో కార్మికులకు మాయమాటలు చెప్పి గుర్తింపు సంఘంగా గెలిచిన ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘంగా ఎంపికైన ఐఎన్‌టీయూసీ నాయకులు సమస్యలను గాలికొదిలేశారని హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఆరోపించారు. సోమవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే-5 ఇంక్లైన్ వద్ద యూనియన్ పనితీరుకు నిరసనగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్మికుల సమస్యలపై తాము పలుమార్లు వినతిపత్రాలు అందజేశామని, అయినా యాజమాన్య వైఖరిలో మార్పురాలేదన్నారు. హెచ్‌ఎంఎస్ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

ఈనెల 16, 17 తేదీల్లో 'ఇఫ్టూ' తరగతులు

ఇల్లెందు: మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో ఈ నెల 16, 17 తేదీల్లో ఐఎఫ్‌టీయూ క్లాసులు నిర్వహిస్తున్నట్లు ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.సీతారామయ్య తెలిపారు. సోమవారం ఇల్లెందులోని ఇఫ్టూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, స్కీంవర్కర్స్, గ్రామ పంచాయతీ, మున్సిపాల్టీ కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలని, నెలకు రూ.26 వేలు వేతనం అందజేయాలని కోరారు. సమావేశంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షులు కె.సారంగపాణి, ఎండీ రాసుద్దీన్, డి.ప్రసాద్, కె.శ్రీనివాస్, సంజీవ్, మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ వ్యవస్థను ఆన్‌లైన్ చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ (సీఎంపీఎఫ్) వ్యవస్థను పూర్తిగా క్రమబద్ధీకరించి, ఆన్‌లైన్ చేయాలని కోల్ మైన్స్ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పి.మాధవ్‌నాయక్ తెలిపారు. సోమవారం సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్, జి.వెంకటరెడ్డి, కార్పొరేట్ ఏరియా ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, మొగిలిపాక రవి, వడ్డేపల్లి కుమారస్వామి, సాయివేణి, సతీశ్, ఊట్ల గణేశ్, అజ్మీర వెంకటేశ్వర్లు, మోహన్‌లాల్, పుష్ప, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దండి..

జూలూరుపాడు: మండలంలోని బేతాళపాడు సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న శ్రీసోమన్న స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్‌కు మాజీ సర్పంచ్ గుగులోత్ రాందాస్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాందాస్ మాట్లాడుతూ.. కాకతీయుల కాలం నాటి శ్రీసోమన్న స్వామి ఆలయ అభివృద్ధి, రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని కోరారు.

అందుబాటులో ఎరువులు

టేకులపల్లి: ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని, అందుబాటులోకి ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు తీసుకొచ్చామని సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు అన్నారు. సోమవారం బోడు పంచాయతీ పరిధిలోని లాక్యాతండాలో బేతంపూడి సొసైటీ ఆధ్వర్యంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. బొమ్మనపల్లి, బోడు ప్రాంతాల్లో సబ్ సెంటర్లు ఏర్పాటు చేశామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాలుష్యకోరల్లో..


అల్లూరిసెంటర్ నుంచి కర్మాగారానికి వెళ్లే రోడ్డులో కనిపించని పచ్చదనం

పవర్‌ప్లాంట్ రోడ్‌లో పచ్చదనం కరువు

- మొక్కలు నాటడంపై దృష్టిసారించని కేటీపీఎస్ అధికారులు
- రోడ్డు పొడవునా అడ్డగోలుగా ఆక్రమణలు
- కనీసం మెరుగులు దిద్దని వైనం

పాల్వంచ: విద్యుత్ ఉత్పత్తిలో రాష్ట్రానికికే తలమానికంగా కేటీపీఎస్ తన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. అయితే ఇక్కడ కాలుష్య ఉద్గారాలు అధికం. నిత్యం కర్మాగారంలో విద్యుత్ ఉత్పత్తి చేసే క్రమంలో వాయు, జల కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటారు. అయితే ఈ కర్మాగారం నుంచి వెలువడే కాలుష్యాన్ని కాస్త అయినా నియంత్రించేందుకు చేపడుతున్న చర్యలు అంతంత మాత్రమేనని తెలుస్తోంది. ఇక పచ్చదనం కోసం యాజమాన్యం చేపడుతున్న చర్యలు మచ్చుకు కూడా కనిపించిన దాఖలాలు లేవు. కర్మాగారంలో ఏటు చూసినా పచ్చని చెట్లు లేవు. ఐదేళ్ల కిందట నిర్మించిన 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 7వ దశ కర్మాగారంలో సైతం చెట్లు పెంచి కర్మాగారాన్ని మరింత అందంగా కనిపించేలా చేయాల్సి ఉండగా, కర్మాగారంలో సరైన పచ్చదనం జాడలు కనిపించడం లేదని పలువురు చెబుతున్నారు. అల్లూరి సెంటర్ నుంచి కర్మాగారం వెళ్లే మార్గంలో ఎక్కడా మచ్చుకు కూడా పచ్చదనం కనిపించడం లేదు. కర్మాగారం గోడ పొడవునా ఫెన్సింగ్ ఉన్నా అందులో ఒక్క మొక్క నాటిన దాఖలాలు లేకపోవడంపై ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

కర్మాగారానికి వెళ్లే రోడ్డు అధ్వానం

1969లో ఏర్పడిన కేటీపీఎస్ ఓఅండ్‌ఎం కర్మాగారం అంచెలంచెలుగా ఎదిగింది. ప్రస్తుతం 1,800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఇక్కడ జరుగుతోంది. అయితే ఈ కర్మాగారంలో అనుకున్నంత ఆహ్లాదభరిత వాతావణం కనిపించడం లేదనే విమర్శలు ఎప్పటినుంచో వస్తున్నాయి. జిల్లాలోని అనేక ప్రైవేట్ పరిశ్రమలు పచ్చదనానికి ఇస్తున్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. ఇక నిర్వహణకు సైతం ఎంతో ఖర్చు చేస్తున్నాయి. అనేక పురస్కారాలను సైతం తీసుకుంటున్నాయి. కానీ, నిత్యం దుమ్ము, ధూళి, పొగ వెదజల్లే ఈ కర్మాగారం పరిసరాల్లో సరైన చెట్లు లేక పోవడం గమనార్హం. ఇక కర్మాగారానికి వెళ్లే రోడ్లలో ఎక్కడా ఒక్క చెట్టు కనిపించడం లేదు. ఇక రోడ్డు పక్కన ఉన్న స్థలాలన్నీ ఆక్రమణకు గురయ్యాయి. వీటిని తొలగించి రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెంచాలని, తద్వారా కర్మాగారానికి వెళ్లే రోడ్డు పొడవునా మరింత ఆహ్లాదం ఉట్టి పడేలా ఉండటంతో పాటు, పర్యావరణ సమతుల్యత కాపాడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

పచ్చదనంపై శ్రద్ధ కరువు

పర్యావరణం కోసం నిధులు వెచ్చించి నర్సరీలు ఏర్పాటు చేయడంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల గ్రామాలు, పట్టణ వీధులు, నివాస గృహాల ప్రజలకు సైతం చెట్లు ఉచితంగా అందించి పర్యావరణానికి పెద్దపీట వేసి ఇక్కడ కాలుష్య ఉద్గారాల నుంచిఉపశమనం కోసం అనేక చర్యలు చేపట్టాల్సి ఉంది. కానీ, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. నర్సరీల నిర్వహణ లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇక కర్మాగారానికి వచ్చే రోడ్‌లో కనీసం వాహనదారులకు సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో, కర్మాగారానికి వెళ్లే అల్లూరిసెంటర్ నుంచి కర్మాగారంలోని అన్ని ఖాళీ ప్రదేశాల్లో చెట్లు పెంచి, ఆహ్లాదకర వాతావరణాన్ని పెంపొందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


ఫెన్సింగ్ వెంట పెరిగిన పిచ్చిమొక్కలు

పచ్చదనం పెంచేందుకు కృషి



కర్మాగారంలో పచ్చదనం పెంపొందించేందుకు స్థలాలను పరిశీలించాలని కిందిస్థాయి అధికారులకు సూచన చేశాం. మొక్కలు నాటి పెంచడంపై తప్పక చర్యలు తీసుకుంటాం. అల్లూరిసెంటర్ నుంచి కర్మాగారం వరకు చెట్లు పెంచే విషయాన్ని పరిశీలించి తగుచర్యలు చేపడుతాం.

–శ్రీనివాసబాబు, కేటీపీఎస్ సీఈ 7వ దశ

ఆదర్శంగా తీర్చిదిద్దేలా కృషి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంను అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపేలా నిరంతరం కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. నియోజకవర్గంలోని కొత్తగూడెం, లక్ష్మీదేవపల్లి, సుజాతనగర్ మండలాల పరిధిలో సోమవారం ఆయన వివిధ పథకాల ద్వారా మంజూరైన రూ.665.31 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశారు. కొత్తగూడెంలో జెన్కో సీఆర్ఆర్ నిధులు రూ.కోటితో నిర్మించే బీసీ బాలికల భవన సముదాయానికి శంకుస్థాన చేశాక కూనంనేని మాట్లాడారు. ఒకేరోజు 103 పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. ప్రజలకు కనీసం మౌలిక వసతులు కల్పించేవరకు విశ్రమించబోనని స్పష్టం చేశారు. జిల్లా బీసీ సంక్షేమాధికారి ఇందిర, మున్సిపల్ కమిషనర్ సుజాత, జిల్లా గ్రంథాలయ సంస్థ, పీఏసీఎస్ చైర్మన్లు వీరబాబు, హన్మంతరావు, వివిధ శాఖల అధికారులు వెంకటేశ్వరరావు, రామకృష్ణ, శివలాల్, నాయకులు ఎస్కే సాబీర్‌పాషా, చంద్రగిరి శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, యూసుఫ్, ధర్మరాజు, బోయిన విజయ్, సత్యనారాయణాచారి, నేరెళ్ల రమేశ్, నేరెళ్ల శ్రీనివాస్, జగన్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, మిర్యాల రాము తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కేసులు ఎత్తివేయాలని వినతి


డీఎఫ్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): దమ్మపేట మండలం పోడుసాగుదారులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డీఎఫ్‌ఓ కృష్ణగౌడ్‌కు సోమవారం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాగులపల్లి ప్రాంతంలో సర్వే నంబర్ 454లో ఉంటున్న భూదాన భూమిలో సెంటు భూమిలేని ఆ ప్రాంత ఆదివాసీ గిరిజనులు సాగు చేసుకునేందుకు పూనుకున్నారని, ఈ భూములపై చట్ట ప్రకారం భూదాన బోర్డుకు మాత్రమే పూర్తి అధికారాలు ఉన్నాయని, ఈ భూమిపై ఫారెస్ట్ శాఖకు ఎలాంటి అధికారం లేదని, ఆ భూముల సాగుకు వెళ్లిన పోడు సాగుదారులు, నాయకులపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గౌని నాగేశ్వరరావు, ఎస్కే ఉమర్, బర్ల రామకృష్ణ, రాజేశ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్వెస్టిగేషన్ విభాగంలో పతకం

సుజాతనగర్: సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్ విభాగంలో సుజాతనగర్ ఎస్‌ఐ మాలోత్ రమాదేవి కాంస్య పతకాన్ని సాధించారు. గత నెల 31 నుంచి ఆగస్టు 2 వరకు వరంగల్‌లోని మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ డ్యూటీ 2వ మీట్ నిర్వహించారు. భద్రాద్రి జోన్ నుంచి రమాదేవి ఎంపిక కాగా.. సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్ విభాగంలో మెడికో లీగల్ ఓరల్ టెస్ట్‌లో ఆమె కాంస్య పతకాన్ని సాధించారు. డీజీపీ జితేందర్ చేతులమీదుగా వరంగల్‌లో పతకాన్ని అందుకోగా.. ఆమెను పలువురు అభినందించారు.


పతకం తీసుకుంటున్న ఎస్‌ఐ రమాదేవి

మరో కర్మాగారాన్ని నిర్మించాలి


మాట్లాడుతున్న జమ్ముల సీతారామిరెడ్డి

పాల్వంచ: పాల్వంచలో మరో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించాలని కేటీపీఎస్ 8వ దశ సాధన సమితి చైర్మన్ జమ్ముల సీతారామిరెడ్డి, కన్వీనర్ మంగీలాల్ అన్నారు. సోమవారం స్థానిక కేటీపీఎస్ అంబేడ్కర్ సెంటర్‌లో కర్మాగారాన్ని నిర్మించాలని డిమాండ్ చేస్తూ సాధన సమితి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాల్వంచలో కొత్త కర్మాగారం నిర్వహించడం ఆర్థిక భారమేమీ కాదని, కూత వేటు దూరంలో కిన్నెరసాని రిజర్వాయర్, కొత్తగూడెం, కోయగూడెం, మణుగూరు, ఇల్లెందు బొగ్గుగనులు, మూసివేసిన ఓఅండ్‌ఎం కర్మాగారం స్థలం, రైల్వే లైన్లు ఉన్నాయన్నారు. ఈ విషయంపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రాలు అందించామని, కర్మాగారం మంజూరు చేసే వరకు పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు దుర్గా అశోక్, రాధాకృష్ణ, రాజేందర్, కోటేశ్వరరావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జేకేఓసీ ప్రారంభించాలని ధర్నా


టేకులపల్లి: కేఓసీలో ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఇల్లెందు/టేకులపల్లి: సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఇల్లెందు బ్రాంచ్ పిలుపుమేరకు జేకే-5 ఓసీలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఓసీ ఇన్‌చార్జ్ మేనేజర్ శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫిట్ కార్యదర్శి ఎన్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జేకే-5 ఓసీ బొగ్గు ఉత్పత్తి నిలిపివేశారని, వెంటనే నూతన ఓసీని ప్రారంభించాలని కోరారు. ఉద్యోగులను బదిలీ చేయొద్దని, విస్తరణ గనిని ప్రారంభించి బొగ్గు ఉత్పత్తి జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో బి.శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్, ఎన్.ఐలయ్య, ఆంజనేయులు, కృష్ణ, ప్రసాద్‌రెడ్డి, సర్వర్, మగ్బుల్ షరీఫ్, ఎస్.ఐలయ్య, సత్యరాజ్, రవి తదితరులు పాల్గొన్నారు. అలాగే, నూతన జేకేఓసీ పనులను సింగరేణి చేపట్టాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేఓసీలోని పీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జ్ మేనేజర్ ఉండం బ్రహ్మంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు, ఫిట్ కార్యదర్శి బానోత్ బాలాజీ, వెంకటనర్సయ్య, ముకేశ్‌పాసీ, దాట్ల శ్రీకాంత్, కోటేశ్వరరావు, కరుణశంకర్, కనకరాజు, ధర్మింగ్, బుర్ర శ్రీరాములు, వీరస్వామి, హేమంత్కుమార్, శ్రీనివాస్, జంపయ్య, అబ్దుల్ ఖుద్దుస్, రాజలింగం పాల్గొన్నారు.

జిల్లా క్రీడాకారులకు పతకాలు


క్రీడాకారులతో కాశీహుస్సేన్

కొత్తగూడెంటౌన్: ఖమ్మంలో ఆదివారం జరిగిన కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారని రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీహుస్సేన్ తెలిపారు. వివిధ విభాగాల్లో కె.లిఖిత్‌చరణ్ బంగారు పతకం, బి.భానుకృష్ణ, ఎస్.షణ్ముఖశ్రీ, సీహెచ్.సాత్విక, వి.శరణ్య వెండి పతకాలు సాధించారని వెల్లడించారు. క్రీడాకారులను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగా సీతారాములు, ప్రధాన కార్యదర్శి పి.కాశీహుస్సేన్‌తో పాటు ఎస్కే సాబీర్‌పాషా, ఐ.ఆదినారాయణ, ఎన్.వెంకటేశ్వర్లు, రాజాసుబ్రహ్మణ్యం, మల్లికార్జున్ సోమవారం అభినందించారు.

ఆగస్టు 9న సెలవుదినంగా ప్రకటించాలి

పాల్వంచరూరల్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా వేడుకలకు నిధులను మంజూరు చేసి ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని ఆదివాసీ సంఘాల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లిలోని కొమరంభీం భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆదివాసీ జేఏసీ నేతలు పాల్గొని మాట్లాడారు. వరల్డ్ ఆదివాసీ దినోత్సవం నాడు ఆదివాసీ హక్కులపై చర్చించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల అభివృద్ధి కోసం ప్రత్యేక ఆర్థిక పాలసీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. మండలంలోని సూరారం కొయ్యగుంపులో 9వ తేదీన కొమరంభీమ్ విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందని, ఆదివాసీలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వాసం రామకృష్ణదొర, సోయం సత్యనారాయణ, మెస్సు సహదేవులు, తోలేం బాబూరావు, పడిగ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆదివాసీ జేఏసీ నేతలు

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

టేకులపల్లి: ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అన్ని మండల కేంద్రాల్లో, గ్రామాల్లో సభలు, సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బానోత్ ఊక్లానాయక్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కులకు భంగం కలిగించే విధంగా ప్రభుత్వాలు ప్రవర్తిస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో గొగ్గల పాపారావు, నాగరాజు, భూక్య శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న అమరేందర్‌రెడ్డి

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి పాల్వంచలోని ప్రశాంత్‌నగర్‌కాలనీకి చెందిన తుమ్మల శివారెడ్డి, సీతకల్యాణి దంపతుల కుమారుడు డాక్టర్ అమరేందర్‌రెడ్డి రూ.25,000 నగదును గుడి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావుకు అందజేశారు. ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి సోమవారం వివరాలు వెల్లడించారు. కాగా, విరాళాలు అందజేసిన భక్తుడికి అమ్మవారి శేషవస్త్ర, ప్రసాదాలను అందజేశారు.

పీహెచ్‌సీ మంజూరు చేయాలి

ఇల్లెందురూరల్: చల్లసముదరం గ్రామపంచాయతీ కేంద్రంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయాలని కోరుతూ పీవైఎల్, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో సోమవారం చల్లసముద్రంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పీవైఎల్ డివిజన్ నాయకుడు అనిల్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో పీవైఎల్, పీఓడబ్ల్యూ నాయకులు మోకాళ్ల రమేశ్, మోతీలాల్, సుభద్ర మాట్లాడుతూ.. చల్లసముద్రం ఉమ్మడి గ్రామపంచాయతీ సమీపంలోని ఇతర గ్రామ పంచాయతీల జనాభా మొత్తంగా 15 వేలకు మించి ఉంటుందని, ఈ ప్రాంతానికి సంబంధించిన పీహెచ్‌సీ 20 కిలోమీటర్ల దూరంలో ఉండటం వల్ల స్థానిక ప్రజలు ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. అమాత్యులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి చల్లసముద్రం కేంద్రంగా పీహెచ్‌సీ ఏర్పాటు ఆవశ్యకతను గుర్తించి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రావూరి ఉపేందర్, ఐలు కంట్లమ్మ, నరాటి వెంకటేశ్వర్లు, ఐలు శ్రీను, గంగారపు కోటయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోతీలాల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జూలూరుపాడు విద్యుత్‌శాఖ ఏఈ నరసింహారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాపకొల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 33 కేవీ కొత్త లింక్ లైన్ పనులు, మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

తహసీల్ ఎదుట ధర్నా

పాల్వంచరూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వరక అజిత్ మాట్లాడారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు నిర్మించాలని, తాగునీటి సౌకర్యం, మూత్రశాలలు లాంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుండాల సుజన్, సంజయ్, మహేశ్, నవీన్, వంశీ, నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

జూలూరుపాడు: స్థానిక కేజీబీవీకి వెళ్లే రహదారిలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రం నుంచి సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న కేజీబీవీకి వెళ్లే మార్గంలో వీధిలైట్లు లేక రాత్రి సమయాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థినులను ఆస్పత్రికి తీసుకెళ్లాలన్నా ఇబ్బందికరంగా మారిందని, సంబంధిత అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

కిరాయిలు ఇప్పించండి..

ఇల్లెందు: పట్టణంలోని మెయిన్‌రోడ్ హైస్కూల్ ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ గదుల కిరాయిలు స్కూళ్లకు ఇప్పించాలని పీడీఎస్‌యూ నాయకులు సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గణేశ్ మాట్లాడారు. షాపింగ్ కాంప్లెక్స్ స్థలం పాఠశాలకు చెందిందని, కాంప్లెక్స్ నిర్మించేటప్పుడు సగం కిరాయిలు స్కూల్‌కు ఇస్తామని మున్సిపాలిటీ పాలకవర్గం హామీ ఇచ్చిందని, కానీ, ఒక్క రుపాయి కూడా ఇవ్వలేని స్పష్టం చేశారు. విజయ్, అరుణ్, చంటి పాల్గొన్నారు.

సింగరేణి సీఎండీతో భేటీ

ఇల్లెందు: సింగరేణి భవన్‌లో సీఎండీ బలరాంను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇల్లెందులో నూతన ఓసీ ఏర్పాటు, నిర్వాసితుల సమస్యలపై సీఎండీతో చర్చించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, హనుమంతరావు, కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

ఊసేలేని ఉచిత చేపపిల్లల పంపిణీ

సుజాతనగర్: మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం నీరుగారుతోంది. వర్షాకాలం ప్రారంభమై ఆగస్టు వచ్చినా టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో ఈ ఏడాది చేప పిల్లల పంపిణీ ప్రశ్నార్థకంగా మారింది. దీంతో జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన సింగభూపాలం చెరువుకు సంబంధించిన మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఏటా ఏప్రిల్‌లో టెండర్లు పిలిచి మేలో ప్రక్రియ పూర్తి చేసి జూలైలో పంపిణీ చేస్తే వర్షాకాలం ముగిసేలోపు జలాశయాల్లో చేపలు పెరిగేందుకు సమయం అనుకూలంగా ఉంటుందని మత్స్యకారులు చెబుతున్నారు. చేపలు పెరిగేందుకు కనీసం ఆరు నెలల సమయం పడుతుందంటున్నారు. ఆలస్యమైతే చేపపిల్లలు ఎదిగేందుకు సమయం సరిపోదని ఫిబ్రవరి వరకు ఎండలు ముదిరిపోతాయని పేర్కొంటున్నారు. సకాలంలో చేప పిల్లలు పంపిణీ చేస్తే జీవనోపాధి కలుగుతుందని కోరుతున్నారు. సింగభూపాలం మత్స్యపారిశ్రామిక సహకార సంఘంలో సుమారు 400 మంది సభ్యులు ఉన్నారు. ఏటా ప్రభుత్వం సుమారు 7 లక్షల చేపపిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఈసారి ఇంకా టెండర్ల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో చేపపిల్లల పంపిణీ ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయమై జిల్లా మత్స్యశాఖాధికారి ఇంతియాజ్‌ను వివరణ కోరగా.. టెండర్లు ఖరారు కాగానే చేపపిల్లల పంపిణీ చేపడుతామని తెలిపారు.


సింగభూపాలెం చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారుడు (ఫైల్)